క్లుప్తంగా

విద్యార్థులకు ఉచిత వైద్య పరీక్షలు



కర్లపాలెం: విద్యార్థులు ఆరోగ్యంగా ఉన్నప్పుడే చదువుపై ధ్యాస పెట్టగలరని సత్యసాయి సేవా సంస్థల ఉమ్మడి గుంటూరు జిల్లా కన్వీనర్ జాలాది సీతారామయ్య తెలిపారు. కర్లపాలెం ప్రాథమిక పాఠశాల, ఉర్దూ పాఠశాలలోని విద్యార్థులకు శనివారం కర్లపాలెం ప్రాథమిక పాఠశాలలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో డాక్టర్ గోవింద్ విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. అలాగే విద్యార్థులందరికీ సత్యసాయి సేవా సమితి తరఫున పాదరక్షలు పంపిణీ చేశారు. సత్యసాయి సేవా సంస్థల ఆధ్యాత్మిక కన్వీనర్ కృష్ణవేణి, కర్లపాలెం సత్యసాయి సేవా సమితి అధ్యక్షుడు తుమ్మల శ్రీనివాసరావు, విద్యార్థులు ఉన్నారు.

ఈస్టర్ వేడుకలకు సర్వం సిద్ధం



భట్టిప్రోలు: మండలంలోని అన్ని గ్రామాల్లో ఈస్టర్ పండుగ జరుపుకొనేందుకు శనివారం తమ పూర్వీకుల సమాధులను పరిశుభ్రం చేసుకునే పనిలో క్రైస్తవులు నిమగ్నమయ్యారు. ఆదివారం సమాధుల వద్ద పునరుత్థాన ప్రార్థనలు చేయనున్నారు. వేకువజామునే శ్మశాన వాటికలలో తమ పూర్వీకుల సమాధుల వద్ద పూలతో అలంకరించి కొవ్వొత్తులు వెలిగించేందుకు సన్నాహాలు చేసుకుంటున్నారు. ఏసుక్రీస్తు మరణించి పునరుత్థానుడై తిరిగి రానున్న సందర్భంగా పురస్కరించుకుని ఈస్టర్ పడుగను నిర్వహించుకోవడం ఆనవాయితీగా వస్తుంది.

బీసీలకు సముచితస్థానం కల్పించాలి

బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు

ఐలవరం(భట్టిప్రోలు): జనాభాలో అత్యధిక శాతం ఉన్న బీసీలకు ప్రభుత్వం సముచిత స్థానం కల్పించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు పేర్కొన్నారు. శనివారం వేమూరు నియోజకవర్గ పర్యటనలో భాగంగా భట్టిప్రోలు మండలం ఐలవరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో భాగంగా బాపట్ల జిల్లా ఉపాధ్యక్షుడిగా జొన్నాదుల వెంకటేశ్వరరావు, కార్యదర్శిగా ఈడే శ్రీనివాసరావులకు నియామక పత్రాలు అందచేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బాపట్ల రవికుమార్, జిల్లా న్యాయ సలహాదారుడు నటరాజన్, బాపట్ల, వేమూరు నియోజకవర్గ, యువజన అధ్యక్షులు పిన్నిబోయిన వెంకటేశ్వర్లు, ఎస్ఎస్‌పీ రాజు, బీసీ నాయకులు కూరపాటి రఘురామయ్య, తాతా సాంబయ్య, శంకర్, శ్రీనివాసరావు, రాజేష్ పాల్గొన్నారు.

రేపు ఉచిత వైద్యశిబిరం

రేపల్లె రూరల్: పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాల ఆవరణంలో ఈ నెల 10వతేదీ సోమవారం ఉదయం 10 గంటలకు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ రేపల్లె బ్రాంచ్ ఆధ్వర్యంలో విజయవాడ అను మైబేబీ కేర్ ఆసుపత్రి వారిచే తల్లి–బిడ్డల ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తామని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ రేపల్లె బ్రాంచ్ చైర్మన్ డాక్టర్ వసంతం వీరరాఘవయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తల్లి, బిడ్డలు వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు.

ఆరుగురు జూదరులు అరెస్ట్

రేపల్లె రూరల్: పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకున్న సంఘటన మండలంలోని రావిఅనంతవరం గ్రామంలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. పట్టణ సీఐ విజయచంద్ర వివరాల మేరకు తమకు అందిన సమాచారంతో రావిఅనంతవరం గ్రామంలో దాడులు నిర్వహించి, గ్రామంలోని పొలాలలో పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.10,100లను స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులను కోర్టులో హాజరుపరిచినట్లు చెప్పారు. ప్రజలు తమ సమీపంలో ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే 9440796169 ఫోన్ నంబరుద్వారా సమాచారం అందించాలని, సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని చెప్పారు.

పెనుమాకలో రక్తదాన శిబిరం

తాడేపల్లిరూరల్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా శనివారం ఐశ్వర్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో తాడేపల్లి పట్టణ పరిధిలోని పెనుమాకలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఐశ్వర్య ఫౌండేషన్ నిర్వాహకులు మాట్లాడుతూ రక్తదానం చేయడం ద్వారా అవసరమైన వారికి రక్తం అందించవచ్చని అన్నారు. రక్తదానంపై యువత అపోహలు విడనాడాలని అన్నారు. ఆరోగ్యవంతంగా ఉండే వారు ప్రతి ఆరు నెలలకు ఒకసారి రక్తదానం చేయవచ్చని, దీని వల్ల కొత్త రక్తం ఏర్పడి ఉత్సాహంగా ఉంటారని అన్నారు. రక్తదానం చేయడానికి ముందుకు వచ్చిన చైతన్య అంబేద్కర్ యువతను అభినందించారు. వీరి వద్ద నుంచి 20 యూనిట్ల రక్తం సేకరించామని తెలిపారు. అనంతరం రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.

అందరి నోటా జగనన్నే మా భవిష్యత్

- మంత్రి మేరుగ నాగార్జున
- గాజుల్లంకలో కార్యక్రమం ప్రారంభం.. ఇంటింటి సర్వే నిర్వహణ



గాజుల్లంకలో ఇంటింటి సర్వేలో భాగంగా మహిళతో మాట్లాడుతున్న మంత్రి మేరుగ నాగార్జున

కొల్లూరు: ప్రభుత్వ పనితీరుపై ప్రతి ఒక్కరి నోటా సంతృప్తి మాటే వినిపిస్తుందని, ప్రభుత్వం నిష్పక్షపాతంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతోనే ప్రజలు వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పక్షాన నిలుస్తున్నారని మంత్రి మేరుగ నాగార్జున అన్నారు. వైఎస్సార్ సీపీ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'జగనన్నే మా భవిష్యత్.. మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమంలో భాగంగా ఆయన మండలంలోని గాజుల్లంకలో ఇంటింటి సర్వేలో పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి కుటుంబానికి మేలు జరిగే విధంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేరుగా లబ్ధిదారులకు సంక్షేమ పథకాలను అందించడంతో ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పాలనకు ముగ్ధులవుతున్నారన్నారు. ప్రతిపక్ష టీడీపీ అధికారంలో ఉన్న సమయంలో ప్రజా సంక్షేమాన్ని విస్మరించి అవినీతికి పట్టం కట్టడంతో ప్రజలు చంద్రబాబుకు తగిన గుణపాఠం నేర్పారన్నారు. ఈసందర్భంగా ఇంటింటికి తిరిగిన ఆయన ప్రభుత్వ పనితీరుపై రూపొందించిన ప్రశ్నలను చదివి వినిపించి ప్రజల అభిప్రాయాలను తెలుసుకున్నారు. అనంతరం గృహ యజమానుల అనుమతితో ఇళ్లకు, సెల్ ఫోన్‌లకు స్టిక్కర్లను స్వయంగా అంటించారు. ఈసందర్భంగా ఆయన గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు, నాయకులకు పలు సూచనలు చేశారు. వైఎస్సార్ సీపీ తలపెట్టిన కార్యక్రమ ముఖ్య ఉద్దేశం నెరవేరే విధంగా నిబద్ధతతో సర్వేను నిర్వహించాలన్నారు. మండలంలోని గాజుల్లంక, పెదలంక, ఈపూరులంక సచివాలయాల పరిధిలోని ఆవులవారిపాలెం, పెసర్లంక, పెదలంక, చింతర్లంక, ఈపూరులంక, సుగ్గునలంక, చిలుమూరులంక గ్రామాలలో ఆయన ఇంటింటి సర్వేలో పాల్గొని ప్రజాభిప్రాయాలను సేకరించి టీడీపీ అకృత్యాల గురించి వివరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు చొప్పర సుబ్బారావు, వైస్ ఎంపీపీ మురాల రాంబాబు, సర్పంచ్‌లు సనక వెంకట్రావు, గొల్లపూడి వెంకటసుబ్బారావు, శీలం అంకమ్మరావు, మేకతోటి శ్రీకాంత్, ఎంపీటీసీ సభ్యులు బావిరెడ్డి వెంకట్రామయ్య, సుగ్గున అశోక్, వైఎస్సార్ సీపీ నాయకులు సూర్యదేవర రామకృష్ణ, సింగం కృష్ణప్రసాద్, అయిల సుబ్బారావు, కనపర్తి మోహన్‌రావు, పాల్గొన్నారు.

పిట్టలవానిపాలెంలో...

పిట్టలవానిపాలెం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు బాపట్ల శాసన సభ్యుడు కోన రఘుపతి సూచనలతో పిట్టలవానిపాలెం గ్రామంలో వైఎస్సార్ సీపీ నాయకులు జగనన్నే మా భవిష్యత్–మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. నాయకులు ప్రతి ఇంటికి వెళ్లి వాళ్లు పొందిన లబ్ధిని వివరించగా, లబ్ధిదారులు తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు. జగనన్నే మా భవిష్యత్ స్టిక్కర్లను ప్రతి ఇంటికీ అతికించారు. బొలగాని సుబ్బారావు, గోవతోటి విజయ్, దోమ తిరుమల రెడ్డి, చేబ్రోలు సురేష్, పిట్టు మధుసూదనరెడ్డి తదితరులు ఉన్నారు.

భట్టిప్రోలులో...

భట్టిప్రోలు: జగనన్నే మా భవిష్యత్తు – మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమం శనివారం భట్టిప్రోలు మండలంలో దిగ్విజయంగా కొనసాగుతుంది. భట్టిప్రోలులో జరిగిన కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కొతరపు పిచ్చయ్యశాస్త్రి, ఎంపీటీసీ సభ్యురాలు కొతరపు పద్మావతి, జేసీఎస్ ఇన్‌చార్జి శ్రీనివాసరావు, పల్లెకోన సచివాలయం పరిధిలో నిర్వహించిన కార్యక్రమంలో ఈడిగ కార్పొరేషన్ డైరెక్టర్ శేరు శ్రీనివాసరావు, పల్లెకోన, రాచూరు సర్పంచులు బొల్లెద్దు రాజమ్మ ప్రతాప్, జయవరపు రాధా కృష్ణమూర్తి, మాజీ సర్పంచ్ మండవ రామకోటేశ్వరరావు, జస్వంత్‌రాజ్,వైఎస్సార్ సీపీ నాయకులు తలకొల యలమంద, వేల్పూరి బాలసుబ్రహ్మణ్యం, షేక్ అబ్దుల్ కరీమ్, చేబ్రోలు నాగార్జున, దాసరి ఫణీంద్ర సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

రేపల్లె: రేపల్లె నియోజకవర్గంలో జగనన్న మా భవిష్యత్ –మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం శనివారం సందడిగా జరిగింది. పట్టణం, పంచాయతీలలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కౌన్సిలర్‌లు, సచివాలయాల కన్వీనర్‌లు, గృహసారథులు ప్రతి ఇంటిని పలకరిస్తూ గత నాలుగు సంవత్సరాల కాలంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో సంక్షేమ పథకాల ద్వారా అందిన లబ్ధిని వివరిస్తూ చంద్రబాబు చేసిన మోసాలను ప్రజలకు వివరించారు. ఈ నేపథ్యంలో పట్టణంలోని 4వవార్డులో కౌన్సిలర్ నాగలక్ష్మి, 22, 18వార్డులలో మున్సిపల్ వైస్‌చైర్మన్‌లు టీకేపీ గుప్త, గుజ్జర్లమూడి ప్రశాంత్ కుమార్‌లు, 25వవార్డులో కౌన్సిలర్ షేక్ కరీమున్నీసా, గృహసారథులు, ఇంటింటికి తిరిగి లబ్ధిదారుల గృహాలపై వారి అనుమతితో స్టికర్‌లను అతికించి సంక్షేమ పథకాల అందుతున్న తీరుపై అభిప్రాయాలు సేకరించారు. మండలంలోని చోడాయపాలెం పంచాయతీలో సర్పంచ్ మాతంగి రవి, బేతపూడిలో జడ్పీటీసీ బొర్రా లక్ష్మీ శ్రీనివారావు, పేటేరులో సర్పంచి కనపర్తి వసుమతి, గంగడిపాలెంలో సర్పంచి తిరుమలశెట్టి శివాజీలు సచివాలయ కన్వీనర్‌లు, గృహసారథులతో ఇంటింటికి వెళ్లి స్టికర్‌లు అతికించారు. అదేవిధంగా నిజాంపట్నం మండలం గుర్నాథనగర్ పంచాయతీలో డీసీఎంఎస్ చైర్‌పర్సన్ యార్లగడ్డ భాగ్యలక్ష్మి మదన్, సర్పంచి అశోక్‌లు ఇంటింటికి తిరిగి ప్రచారం నిర్వహించారు.

కర్లపాలెంలో...

కర్లపాలెం: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించేందుకు జగనన్నే మా భవిష్యత్ – మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం దోహదపడుతుందని ఎంపీపీ యారం వనజ తెలిపారు. శనివారం నల్లమోతువారిపాలెం, ఏట్రవారిపాలెం గ్రామాలలో మండల సచివాలయాల కన్వీనర్ సమ్మెట వెంకటేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. సర్పంచి చీరాల వెంకటలక్ష్మి, జెడ్పీటీసీ పిట్ల వేణుగోపాల్ రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు తాండ్ర సాంబశివరావు, నల్లమోతువారిపాలెం గ్రామ కన్వీనర్ కుంటా రత్నబాబు, చీరాల శ్రీనివాసరెడ్డి, సచివాలయాల కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.

జగనన్న పాలనకు ప్రజలు పట్టం..

కొల్లూరు: ప్రజా సంక్షేమం కోసం పాటుపడుతున్న జగనన్న పాలనకు ప్రజలు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తూ పట్టం కడుతున్నారని వైఎస్సార్ సీపీ బాపట్ల జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు మేరుగ చందన్‌నాగ్ అన్నారు. శనివారం 'జగనన్నే మా భవిష్యత్' మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో భాగంగా కొల్లూరులో వైఎస్సార్ సీపీ నాయకులు, గృహ సారథులు, సచివాలయ కన్వీనర్‌లతో కలసి ఇంటింటి సర్వేలో పాల్గొన్నారు. వైస్ ఎంపీపీ మురాల రాంబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు సూర్యదేవర రామకృష్ణ, అయిలా సుబ్బారావు, ఉప్పు శ్రీనివాసరావు, గరిక రమేష్ పాల్గొన్నారు.

చుండూరు(వేమూరు): జగనన్న మా భవిష్యత్తు కార్యక్రమం చుండూరు మండల కేంద్రంలో గ్రామ సచివాలయం కన్వీనర్లు, గ్రామ సర్పంచి వుయ్యూరి అప్పిరెడ్డి ఆధ్వర్యంలో శనివారం జరిగింది. ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వం సంక్షేమ పథకాలు గురించి వివరించి, ఇంకేమైనా సమస్యలు ఉన్నాయా తెలుసుకుంటూ కార్యక్రమం సాగింది.

వలివేరు(వేమూరు): చుండూరు మండలంలోని వలి వేరు గ్రామంలో శనివారం జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం జరిగింది. ఇంటింటికి వెళ్లిన వైఎస్సార్ సీపీ నాయకులు ప్రజలకు అందుతున్న పథకాలపై ఆరా తీశారు. మా నమ్మకం నువ్వే జగన్ అనే స్టికర్లు వారి అనుమతితో పంపిణీ చేశారు. గ్రామ సర్పంచ్‌లు, గ్రామ సచివాలయం కన్వీనర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.



భట్టిప్రోలులో ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న వైస్ ఎంపీపీ



నిజాంపట్నం మండలం గుర్నాథ్ నగర్‌లో పర్యటిస్తున్న డీసీఎంఎస్ చైర్‌పర్సన్ భాగ్యలక్ష్మి



ఏట్రవారిపాలెంలో స్టిక్కర్ అంటించిన ఎంపీపీ యారం వనజ, సర్పంచి వెంకటలక్ష్మి

జనం ఆకాంక్షలకు రూపం...



ఓ ఇంటి గోడకు స్టిక్కర్‌ను అంటిస్తున్న ఎమ్మెల్యే కోన రఘుపతి

బాపట్లఅర్బన్: రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలనపై ప్రజా స్పందన వెల్లు వెత్తుతోందని బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి అన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు 'జగనన్నే మా భవిష్యత్ – మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కోన రఘుపతి శనివారం 9, 10 వార్డు సచివాలయాల్లో ప్రారంభించారు. వార్డు సచివాలయ కన్వీనర్లు, గృహసారథులతో కలిసి ఇంటింటికి వెళ్లి ప్రజలతో మాట్లాడారు. ప్రభుత్వం మంజూరు చేసిన పథకాలపై ఆరా తీశారు. ప్రభుత్వం నుంచి ఇంకా చేయాల్సిన పనులు ఏమైనా ఉన్నాయా అంటూ అడిగి తెలుసుకున్నారు. ఇచ్చిన హామీలను సీఎం వైఎస్ జగన్ 98 శాతం అమలు చేశారని వివరించారు. పేదల సంక్షేమానికి అనేక పథకాలు తెచ్చారని వివరించారు. టీడీపీ హయాంలో జన్మభూమి కమిటీలు దళారులు చెప్పిన వాళ్లకే పథకాలు వచ్చేవని, వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఎలాంటి సిఫార్సులకు తావు లేదని చెప్పారు. అర్హత ప్రామాణికంగా కులం, మతం, రాజకీయాల వర్గాలు చూడకుండా నేరుగా లబ్ధిదారులు ఖాతాలోకి నగదు జమ చేస్తున్నట్లు తెలిపారు. 13 రోజులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళ్లిన ఎమ్మెల్యేకు ప్రజల నుంచి ఘనస్వాగతం లభించింది. ప్రభుత్వం నుంచి అందిన పథకాలతో తమ సంతృప్తికరంగా ఉన్నామని, సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుంటామని ప్రజలు ఎమ్మెల్యేతో అన్నారు. ప్రతి ఇంటికి జగనన్నే మా భవిష్యత్తు పోస్టర్లు అతికించి వారితో పార్టీ సెల్ నెంబర్‌కు ఫోన్ చేయించారు. ఎమ్మెల్యే కోన మాట్లాడుతూ ప్రజల నుంచి చక్కటి స్పందన లభిస్తుందన్నారు. గత ప్రభుత్వానికి, ఇప్పుడున్న జగనన్న ప్రభుత్వం చేసిన మంచిని ప్రజలు చెప్తున్నారన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు కోకి రాఘవరెడ్డి, కర్లపాలెం మండల అధ్యక్షుడు దొంతిపోయిన సీతారామిరెడ్డి, కాగిత సుధీర్ బాబు, చేజర్ల నారాయణరెడ్డి, వడ్డిముక్కల డేవిడ్, చింతల రాజశేఖర్, జోగి రాజా, ఇమ్మడిశెట్టి శ్రీనివాసరావు, ఇనగలూరి మాల్యాద్రి, పిల్లి శేఖర్, పీటబాబు, బొలిమేర అనిల్ కుమార్, ఆట్ల ప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు.

నా మాటలను వక్రీకరించారు

- ఇది ప్రతిపక్షాల దిగజారుడుతనానికి నిదర్శనం
- ఎవరికైనా మనోభావాలు దెబ్బ తింటే క్షమాపణ చెబుతున్నా
- ఎమ్మెల్యే కోన రఘుపతి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోన రఘుపతి

బాపట్ల అర్బన్: బాపట్ల జిల్లా ఏర్పాటై సంవత్సర కాలమైన సందర్భంగా పార్లమెంటు స్థానంపై తాను చేసిన వ్యాఖ్యలను కావాలని వక్రీకరించారని, అయినప్పటికీ ఎవరి మనోభావాలైనా దెబ్బతింటే క్షమాపణలు చెబుతున్నానని ఎమ్మెల్యే కోన రఘుపతి అన్నారు. వైఎస్సార్ సీపీ స్థానిక కార్యాలయంలో శనివారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 1977 సంవత్సరంలో బాపట్ల పార్లమెంట్ నియోజకవర్గం ఏర్పాటైందని తెలిపారు. పార్లమెంట్ నియోజవర్గం ఏర్పాటు క్రమంలో జేడీ శీలం తన రాజకీయ ప్రయోజనాల కోసం ఈ ప్రాంత అభివృద్ధిని నాశనం చేశారని విమర్శించారు. అయితే పార్లమెంటు స్థానం ఏర్పాటులో బాపట్ల, చీరాల, వేమూరు, రేపల్లె, అద్దంకి, పర్చూరు అసెంబ్లీ నియోజకవర్గాలను కలిపి ఏర్పాటు చేశారని, దీంతో బాపట్ల జిల్లాకు తీవ్ర నష్టం కలిగిందని వివరించారు. అటు సంతనూతలపాడు, ఇటు పొన్నూరు నియోజకవర్గాలను వదిలేశారని, ఇవి బాపట్ల జిల్లాకు ఆర్థికంగా వెన్నుదన్నుగా ఉండేవని తెలిపారు. ఈ క్రమంలో జిల్లా ఏర్పాటు గురించి చేసిన వ్యాఖ్యలను ఎల్లో మీడియా, ప్రతిపక్షాలు వక్రీకరించడం వారి దిగజారుడుతనానికి నిదర్శనమని వ్యాఖ్యానించారు. ఎల్లప్పుడూ జిల్లా ప్రజల అభ్యున్నతి కోసమే పాటుపడతామని చెప్పారు.

అభివృద్ధి పనులను పరిశీలించిన అధికారులు



తాడేపల్లిరూరల్: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని ఇప్పటంలో జరుగుతున్న అభివృద్ధి పనులను కార్పొరేషన్ డీఈ కృష్ణారెడ్డి శనివారం పరిశీలించారు. ప్రధాన రహదారి విస్తరణలో భాగంగా ఆక్రమణలను ఇప్పటికే అధికారులు తొలగించారు. ఇప్పటంలో సురక్షిత నీరు అందించేందుకు ఏర్పాటు చేసిన పైపులైన్ గతంలో ఉన్న పాతరోడ్‌కు మార్జిన్ వెంబడి ఉండడంతో ఆ పైపులైన్‌ను మార్చాలని ఇంజినీరింగ్ సిబ్బంది కార్పొరేషన్ అధికారులకు సూచించారు. పైపులైను పనులు పరిశీలించేందుకు డీఈ కృష్ణారెడ్డి విచ్చేశారు. ఆయన మాట్లాడుతూ ఇప్పటంలో రూ.6 కోట్ల వ్యయంతో అభివృద్ధి పనులు చేస్తున్నామని, ప్రధాన రహదారి మధ్యలో డివైడర్ ఏర్పాటుచేసి రెండువైపులా డ్రెయిన్‌లు నిర్మించనున్నామని తెలిపారు. పైపులైన్లు కూడా మార్చేందుకు ప్రణాళిక సిద్ధం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఈ కిషోర్, వైఎస్సార్ సీపీ మండల యువజన నాయకులు మున్నంగి వివేకానందరెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన



విద్యార్థులకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్న కేఎల్‌యూ విద్యార్థులు

తాడేపల్లిరూరల్: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని వడ్డేశ్వరంలో ఉన్న కేఎల్ విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ వలంటీర్లు శనివారం ప్రాతూరులో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. విద్యార్థి సంక్షేమ విభాగం డీన్ డాక్టర్ చప్పిడి హనుమంతరావు మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే మనం ఆరోగ్యంగా ఉంటామని, ఇంటి పరిసరాలను ఎప్పుడూ శుభ్రంగా ఉంచుకోవాలని వివరించారు. అవగాహన కార్యక్రమం నిర్వహించిన విద్యార్థులను విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథివర్మ, ప్రొ వైస్ చాన్సలర్ డాక్టర్ ఎన్.వెంకట్రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, సాక్ డైరెక్టర్ సాయి విజయ్, అసోసియేట్ డీన్ డాక్టర్ కె.రూతు రమ్య, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కో ఆర్డినేటర్ పి.శ్రీకాంత్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ పి. శైలజలు అభినందించారు.

లక్ష్మీనారసింహుడికి విశేష పూజలు

ఫిరంగిపురం: మండలంలోని నుదురుపాడు గ్రామ శివారులోని శ్రీలక్ష్మీనారసింహస్వామివారికి చైత్రబహుళ స్వాతి నక్షత్రాన్ని పురస్కరించుకొని శనివారం విశేషపూజలు చేశారు. ఉదయాన్నే భక్తులు స్వామివారికి పంచామృతాలతో అభిషేకాలు చేసి పట్టువస్త్రాలతో అలంకరించారు. పొంగళ్లు పొంగించి మొక్కులు చెల్లించి పూజలు చేశారు. కార్యక్రమాలను ఆలయ ధర్మకర్త సుబ్బారెడ్డి, వెంకటరమణమ్మలు పర్యవేక్షించారు.

పూరిల్లు దగ్ధం

కర్లపాలెం: ఓ పూరిల్లు దగ్ధమై రూ.50వేల ఆస్తి నష్టం జరిగిన సంఘటన మండల పరిధిలోని దుండివారిపాలెం పంచాయతీ అక్కిరాజుదిబ్బ కాలనీలో శనివారం చోటు చేసుకుంది. గ్రామ వీఆర్ఓ యశ్వంతి తెలిపిన వివరాల మేరకు అక్కిరాజుదిబ్బ కాలనీలో నివాసం ఉంటున్న బొలిమేర సంసోను పూరిల్లు ప్రమాదవశాత్తు దగ్ధమైంది. ఈ ప్రమాదంలో ఇంటితో పాటు వంటపాత్రలు, దుస్తులు పూర్తిగా దగ్ధమయ్యాయని ఆమె తెలిపారు. అగ్ని ప్రమాదానికి కారణాలు తెలియరాలేదని ప్రభుత్వ పరంగా సాయమందించేందుకు కృషి చేస్తామని ఆమె చెప్పారు.

75 మందికి కంటి పరీక్షలు

తాడేపల్లిరూరల్: డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమం ద్వారా తాడేపల్లి ఆరోగ్య కేంద్రంలో శనివారం వైద్య పరీక్షలు నిర్వహించారు. కంటి వెలుగు పారా మెడికల్ ఆప్తాలమిక్ అధికారి వి.వి.కర్ణ మాట్లాడుతూ డాక్టర్ వైఎస్సార్ కంటివెలుగు వైద్య శిబిరంలో 75 మందికి కంటి పరీక్షలు నిర్వహించి, 15 మందికి కళ్లజోళ్లు అవసరం అని గుర్తించామని, కంటి ఆపరేషన్ నిమిత్తం తొమ్మిది మందిని గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి రిఫర్ చేశామని అన్నారు. ఇతర కంటి సమస్యలు ఉన్నవారికి ఉచితంగా మందులు అందజేశామని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సచివాలయ ఏఎన్ఎం విజయలక్ష్మి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

మేడికొండూరు: మండల పరిధిలోని పేకాట స్థావరాలపై మేడికొండూరు పోలీసులు శనివారం మెరుపు దాడులు నిర్వహించారు. నలుగురు పేకాట రాయుళ్లను అదుపులోకి తీసుకున్నారు. పేరేచర్ల లక్ష్మీనరసింహకాలనీలో రహస్యంగా ఒక ఇంటిలో పేకాట ఆడుతున్నారని సీఐ వాసుకి వచ్చిన సమాచారం మేరకు కానిస్టేబుల్స్ డేవిడ్, నజీర్‌లతో కలిసి పేకాట శిబిరంపై దాడిచేశారు. పేకాట ఆడుతున్న నలుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.7210 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ వాసు తెలిపారు.

ఉత్సాహంగా 'రన్ ఫర్ జీసస్'



రన్ ఫర్ జీసస్‌లో పాల్గొన్న క్రైస్తవ నాయకులు

బాపట్ల అర్బన్: రన్ ఫర్ జీసస్ కార్యక్రమం బాపట్ల ఐక్య క్రైస్తవ సమాజం ఆధ్వర్యంలో విజయవంతంగా జరిగింది. సూర్యలంక రోడ్డు నుంచి మొదలైన ఈ పరుగు ఆర్ట్స్ కాలేజీ మీదుగా సాగుతూ సీబీజడ్ చర్చి వద్ద పాస్టర్ల ప్రార్థనతో ముగిసింది. నిర్వాహకుడు ఎఫ్‌డబ్ల్యూ కోల్ మాట్లాడుతూ ఏసు కొరకు పరుగు ముఖ్య ఉద్దేశం ఆయన ప్రపంచ మానవాళి కొరకు ప్రాణం పెట్టి మరణం జయించి తిరిగి లేచాడని, ప్రతి ఒక్కరికీ తెలియజేయడం, క్రైస్తవ సమాజ ఐక్యతను లోకానికి బహిర్గతం చేయటం, క్రైస్తవ నాయకత్వాన్ని బలోపేతం చేయడం, డినామినేషన్ బేధాలు లేని సార్వత్రిక క్రైస్తవ సంఘాన్ని సిద్ధపరచడం, ఆరోగ్యం, ఆధ్యాత్మికత పట్ల యువతను చైతన్యం పరచడం అని వివరించారు. జాన్ వెస్లీ, డి.జాన్సన్, గేర మణిభూషణ్, లెఫ్టినెంట్ కల్నల్ గేరా థామస్, డాక్టర్ రెవరెండ్ జయపాల్, పాస్టర్ నోవా, రెవరెండ్ సునీల్ బాబు, సంఘ కాపరులు, సంఘస్తులు, పెద్దలు పాల్గొన్నారు.

గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు ఐరన్ మాత్రలు ఇవ్వాలి

నేషనల్ హెల్త్ మిషన్ డిస్ట్రిక్ట్ ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ సీహెచ్ రత్న మన్మోహన్



అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించిన ఎన్‌హెచ్‌ఎం డిస్ట్రిక్ట్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ సీహెచ్ రత్నమన్మోహన్

మంగళగిరి: గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు రక్త పరీక్షలు నిర్వహించి రక్తహీనతతో బాధపడే వారిని గుర్తించి ఐరన్ మాత్రలు పంపిణీ చేయాలని నేషనల్ హెల్త్ మిషన్ డిస్ట్రిక్ట్ ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ సీహెచ్ రత్నమన్మోహన్ అన్నారు. మంగళగిరి–తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని యర్రబాలెంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని శనివారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. అంగన్‌వాడీ కేంద్రంలో నమోదైన గర్భిణులు, చిన్నారులకు, బాలింతలకు పౌష్టికాహారంతోపాటు రక్తహీనతతో బాధపడే వారికి ఐరన్ ట్యాబెట్లు, సిరప్‌లను క్రమం తప్పకుండా అందించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం అదే ప్రాంతంలోని డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌ను సందర్శించి రోగులకు అందిస్తున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టి అమలు చేయడం జరుగుతుందన్నారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ప్రతి కుటుంబం వినియోగించుకునే విధంగా ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సూచించారు. 30 సంవత్సరాలు దాటిన వారికి బీపీ, షుగరు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేయాలన్నారు. కార్యక్రమంలో అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారి డాక్టర్ వి రాజేష్, ఆరోగ్య విస్తరణాధికారి కె లక్ష్మీమనోహర్‌లతోపాటు పలువురు ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

వేసవిలో గర్భిణులు జాగ్రత్తలు పాటించాలి

ఫిరంగిపురం: వేసవిలో వడదెబ్బ తగలకుండా గర్భిణులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పొన్నెకల్లు పీహెచ్‌సీ వైద్యాధికారి, నుదురుపాడు పీహెచ్‌సీ ఇన్‌చార్జి సాయి సిద్ధార్థరెడ్డి అన్నారు. వేములూరిపాడు గ్రామంలో శనివారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరం నిర్వహించారు. గర్భిణులు, వృద్ధులు, చిన్నారులు ఎండలో తిరగకూడదన్నారు. తప్పనిసరి అయితే తలకు గుడ్డను ధరించి వెళ్లాలని సూచించారు. మంచినీరు తాగాలని వడదెబ్బ తగిలిందని భావించినప్పుడు ఆరోగ్యసిబ్బంది, అంగన్‌వాడీలు, ఆశ కార్యకర్తల వద్ద, హెల్త్ వెల్‌నెస్ సెంటర్లలో ఓఆర్ఎస్ అందుబాటులో ఉంటాయని దానిని తీసుకోవాలని సూచించారు. రక్తహీనత లేకుండా ఐరన్‌మాత్రలు వైద్యులు సూచించిన విధంగా వేసుకోవాలన్నారు.

విజయదుర్గా ఆలయంలో పూర్ణాహుతి

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని విజయదుర్గా ఆలయం వార్షికోత్సవం శనివారంతో ముగిసింది. ఉదయాన్నే అమ్మవారికి పంచామృతాలతో అర్చకులు వి.రాజేంద్రశర్మ అభిషేకాలు నిర్వహించి పలురకాల పుష్పాలతో విశేష అలంకారం చేశారు. యాగశాలలో చండీహోమం, రుద్రహోమాలను వేదపండితులు నిర్వహించి పూర్ణాహుతి చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేయగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు.

సామాజిక కార్యకర్త శేషమ్మకు సన్మానం

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలో భారతీయ జనతాపార్టీ 43వ ఆవిర్భావ దినోత్సవంలో భాగంగా నిర్మాణ దివస్ కార్యక్రమాన్ని తాడేపల్లి పట్టణ అధ్యక్షులు కాకుమాను భాగ్యేశ్వరరావు ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సంఘ సేవకురాలు, సామాజిక కార్యకర్త మున్నంగి శేషమ్మను సత్కరించామని, ఈమె ఎన్నో సంవత్సరాలుగా సామాజిక సేవ కార్యక్రమాలు నిర్వహిస్తూ, పలుచోట్ల భజన బృందాలను తయారు చేస్తూ, కోలాటాలను నేర్పుతున్నారని అన్నారు. కార్యక్రమంలో తాడేపల్లి పట్టణ ఉపాధ్యక్షుడు టంకశాల ఈశ్వర్‌నాయుడు, చేకూరి శ్రీనివాసరావు, రామ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.